


## టీఎంసీ కుటుంబానికి పరిహారం

**ప్రజానావ, సిరిసిల్ల :** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కింద టౌన్ మిషన్ కో ఆర్డినేటర్(టీఎంసీ) చంటి రాజమణి మరణించగా, బాధిత కుటుంబానికి శ్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ నుంచి మంజూరైన పరిహారం చెక్కును ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం అందజేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కింద టౌన్ మిషన్ కో ఆర్డినేటర్(టీఎంసీ) చంటి రాజమణి సిరిసిల్ల మున్సిపల్ లో పని చేశారు. అక్టోబర్ 2024లో మరణించారు. దీనితో శ్రీ నిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ నుంచి రూ.1,50,000 విలువైన పరిహారం చెక్కు మంజూరు కాగా, రాజమణి కుటుంబ సభ్యులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఏఓ మీర్జా ఫసహత్ అలీ బేగ్, శ్రీనిధి రీజినల్ మేనేజర్ భూ కైలాస్ తదితరులు ఉన్నారు.

## స్పోర్ట్స్ యూనిఫారాలు అందజేత



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్య నగర్ మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ లు అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో స్థానిక అనంత నగర్ లోని వాణి నర్సింగ్ హోమ్ డాక్టర్లు శ్రీ వాణి ఎన్ వి రమణారావులు స్పోర్ట్స్ యూనిఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పీఏపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

### అది పచ్చి అబద్ధం.. రాజకీయ కుట్ర!

**దినేష్ గౌడ్ పీఏ పదవి నుంచి తప్పుకున్నారు : ఎమ్మెల్యే కార్యాలయం**



**ప్రజానావ, వేములవాడ:** ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ)గా వెంగల దినేష్ గౌడ్ పనిచేస్తున్నారంటూ కొన్ని సోషల్ మీడియా వేదికలు, మీడియా సంస్థలు చేస్తున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు వాస్తవాలను వివరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పీఏగా వెంగల దినేష్ గౌడ్ ప్రస్తుతం పనిచేయడం లేదని, దాదాపు ఆరు నెలల క్రితమే ఆయన తన పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నాడని, దీనికి సంబంధించి ప్రభుత్వ రికార్డుల నుంచి కూడా ఆయన పేరును నాలుగు నెలల క్రితమే అధికారులు అధికారికంగా తొలగించారని వివరించింది. ఈ వాస్తవాలు ఇలా ఉండగా, కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్ (ముఖ్యంగా తెలుగు స్క్రైబ్‌వంటివి) రాజకీయ దురుద్దేశంతో పాత హోదాను వాడుతూ తప్పుడు వార్తలు ప్రచారం చేయడం విచారకరమని పేర్కొన్నది.

### వ్యక్తిగత ఘటనలకు ఎమ్మెల్యేకు సంబంధం లేదు!

దినేష్ గౌడ్ వ్యక్తిగత విషయాలు లేదా వారి కుటుంబానికి సంబంధించిన ఏవైనా ఘటనలు చోటుచేసుకుంటే, వాటిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అనుసంధానం చేయడం పూర్తిగా ఆధారరహితమని స్పష్టం చేసింది. కేవలం రాజకీయంగా ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడింది. ఇప్పటికైనా సంబంధిత సోషల్ మీడియా వేదికలు, మీడియా సంస్థలు తమ తప్పుడు ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని హెచ్చరించింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇటువంటి ఆరోపణలు కొనసాగిస్తే, సంబంధిత సంస్థలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించింది.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు

- 'ఫెర్టిలైజర్ యాప్' సేవలను రైతులు వినియోగించుకోవాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లిలోని ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ



**ప్రజానావ, సిరిసిల్ల :** రైతులు ఎరువుల కోసం పడే ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ' ఫెర్టిలైజర్ యాప్' సేవలు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల షాప్ లో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఎందరు రైతులు ఎరువులు బుకింగ్ చేసుకున్నారు? ఎందరు తీసుకువెళ్లారో ఆరా తీసి రిజిస్టర్లు పరిశీలించారు. యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు చేసిన రైతుల వివరాలను రిజిస్టర్లలో తనిఖీ చేశారు. షాప్ లో నిన్న రాత్రి స్టాక్ వివరాలు, గురువారం ఉదయం నాటి స్టాక్ వివరాలు పరిశీలించారు. అలాగే గోడౌన్ లో ప్రస్తుతం ఉన్న ఎరువుల నిలువలను అక్కడ ఉన్న సిబ్బందితో లెక్కింపజేసి సరి చూసారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ' ఫెర్టిలైజర్ యాప్' రైతులు డౌన్ లోడ్ చేసుకోవాలని, దాని ద్వారానే ఎరువులు బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద వద్ద రైతులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్, ఒక సహాయకుడు ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ యాప్‌లో యూరియా బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం తమ పరిధిలోని అన్ని ఎరువుల షాపుల్లో తనిఖీ చేయాలని సూచించారు. యాప్ డౌన్ లోడ్, బుకింగ్ విషయంలో రైతులకు అందుబాటులో ఉండి.. సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 1 వ తేదీ నుంచి ఈరోజు వరకు 92 వేల 735 సంచుల యూరియా వచ్చిందని, యాప్ ద్వారా జిల్లాలోని 84 వేల 68 మంది రైతులు ఎరువుల కోసం బుకింగ్ చేసుకున్నారని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. 79 వేల 948 మంది కొనుగోలు చేయగా, ఇంకా 11వేల 694 నిలువ ఉందని, 740 మంది రైతులు యూరియా కోసం బుకింగ్ చేసుకుని ఇంకా తీసుకువెళ్ల లేదని వివరించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. పరిశీలనలో ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు మానసిక ధైర్యాన్ని పెంచుకోవాలి

- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శరత్ కుమార్
- సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్




**ప్రజానావ, సిరిసిల్ల :** సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులు మానసిక ధైర్యాన్ని, ఆత్మబలాన్ని పెంచుకొని పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శరత్ కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (కో-ఎడ్) జరిగిన ఫేర్వెల్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి శరత్ కుమార్ హాజరై మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే పరీక్షల లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. అలాగే ఇతర కళాశాల నుండి వచ్చిన ప్రిన్సిపాల్ లు ప్రసంగిస్తూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వ కళాశాలలో ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని, ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా కోర్సులలో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కేదారేశ్వర్,టి. శ్రీధర్, బుర్ర వెంకటేశం, సామల వివేకానంద, కనకయ్య, చంద్రమౌళి, అరుంధతి, చంద్రశేఖర్, ఆంజనేయులు, విజయ, శ్రీనివాస్, సురేష్, రాజయ్య, శశిధర్, రాజశేఖర్, సుజిత ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బార్‌లను తలపిస్తున్న వైన్‌షాప్ పర్మిట్ రూములు

- నిబంధనలను పాటించని వైన్ షాప్ యజమానులు
- గల్లీ గల్లీలో బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలు మద్యం అమ్మకం
- నష్టపోతున్న కార్మిక కుటుంబాలు, వెంటనే కలెక్టర్ గారు చర్యలు తీసుకోవాలి
- మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్




**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వైన్ షాప్ యజమానులు నిబంధనలను పాటించకుండా అధికారుల అండదండలతో ప్రతి వైన్ షాప్ వద్ద బార్లను తలదన్నే విధంగా సిట్టింగ్ ఏర్పాటు చేసి మద్యం విక్రయించడం జరుగుతుందనీ సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణ ప్రాంతంలో పాత, కొత్త బస్టాండ్, గాంధీ చౌక్, ప్రధాన రహదారి వెంబడి ఉన్నటువంటి వైన్ షాపుల ముందు వెహికల్స్ నిలబెట్టడం వలన రహదారులకు పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతున్నదని మహిళలు ఆ ప్రాంతం నుండి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొన్నదని, గ్రామాలలో ప్రతి గల్లీలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అందుబాటులో దొరకడంతో ప్రజలు విపరీతంగా మద్యానికి బానిసలు గా మారుతున్నారని, కార్మిక కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. యువత పెద్ద ఎత్తున మద్యానికి అలవాటు పడి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని, ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయమే తప్ప ప్రజల ఆరోగ్య పరిస్థితి, ప్రాణాల పరిస్థితి పట్టించుకునే ధ్యాసే లేకుండా పోయిందన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ నిబంధనకు విరుద్ధంగా నడిపిస్తున్న వైన్ షాపుల లైసెన్స్ రద్దుచేసి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి కోడం రమణ పాల్గొన్నారు.

## ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

**ప్రజానావ, జూబ్లీహిల్స్:** హిందూ ధర్మ రక్షణే ధ్యేయంగా, మొగలాయిల అరాచకాలను అడ్డుకున్న ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్ కొనియాడారు. ఛత్రపతి శివాజీ 396వ జయంతి సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటూరి రమేష్ మాట్లాడుతూ, హిందూ దేవాలయాలను కూల్చివేస్తూ, హిందూ ధర్మాన్ని అంతం చేయాలని చూస్తున్న మొగల్ సామ్రాజ్యంపై సింహంలా విరుచుకుపడిన యోధుడు శివాజీ అని పేర్కొన్నారు. మహిళలను అవమాన పరుస్తున్న దుర్మార్గులను ఎదిరించి నిలబడ్డ ఆ మహానుభావుడి ధైర్యం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. హిందూ ధర్మం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెర్పేటి అశోక్ కుమార్, బోయ సాయిలు, బోదాస్ నాగార్జున, గుంజ ఆంజనేయులు, జెడ్పీటీ నరేంద్ర, ఏ నాగయ్య, హనుమంతు, సాబప్ప, కురుమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## స్వరాజ్య నిర్మాత శివాజీ మహారాజ్

**ప్రజానావ, ఖైరతాబాద్:** హైందవ ధర్మ సంరక్షణే శ్వాసగా, స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా చరిత్రను మలిచిన మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఫిలింనగర్ ప్రాంతంలో బీజేపీ నాయకులు, స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ.. భారత చరిత్రలో స్వాతంత్ర్య స్ఫూర్తికి శివాజీ మహారాజ్ ఒక ప్రతీకగా నిలిచారని అన్నారు. పరాయి పాలన నుంచి విముక్తి పొందేందుకు, స్వరాజ్య స్థాపన కోసం అచంచల ధైర్యంతో ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ మహారాజ్ జయంతిని వైభవంగా నిర్వహించారు.

# దినమంతా, రాత్రంతా 'జయహో'

### ముంబైలో మ్యూజిక్ రోడ్ ప్రయోగంపై వివాదం

### కోస్టల్ రోడ్డులో నిద్రలేక స్థానికుల విలవిల

**'మ్యూజిక్' ఆపేయాలని ముఖ్యమంత్రికి 650 కుటుంబాల ఫిర్యాదు**



**ప్రజానావ, ముంబై:** ముంబై కోస్టల్ రోడ్డుపై ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మ్యూజికల్ రోడ్' ప్రయోగం ఇప్పుడు వివాదానికి దారితీసింది. వాహనాల వేగాన్ని నియంత్రించడానికి, డ్రైవర్లను అలరించడానికి ఏర్పాటు చేసిన ఈ 'జయహో' పాట.. రోడ్డు పక్కన ఉన్న బ్రీచ్ కాండీ నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

**ఏమిటీ మ్యూజికల్ రోడ్ వివాదం?**

ముంబై కోస్టల్ రోడ్డులోని ధర్మవీర్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ మార్గ్‌లో నారిమన్ పాయింట్ నుంచి వర్లి వైపు వెళ్లే మార్గంలో 500 మీటర్ల మేర ఈ మ్యూజికల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేశారు. కారు గంటకు 70 నుండి 80 కిలోమీటర్ల స్థిర వేగంతో వెళ్తున్నప్పుడు టైర్ల ప్రకంపనల ద్వారా ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'జయహో' పాట వినిపిస్తుంది. అయితే, ఉదయం 6 గంటల నుండి అర్ధరాత్రి వరకు వందలాది వాహనాలు వెళ్తుండటంతో ఈ పాట నిరంతరం మారుమోగుతూనే ఉంది.

**నిద్రలేని రాత్రులు.. స్థానికుల ఆవేదన!**

ఈ నిరంతర 'లైవ్ కచేరీ' బ్రీచ్ కాండీ ప్రాంతంలోని దాదాపు 650 కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. "మేము ఎప్పుడు నిద్రపోవాలి? కిటికీలు మూసుకున్నా ఆ శబ్దం లోపలికి వస్తోంది" అని వృద్ధులు, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరాయంగా వినిపించే ఈ సంగీతం మానసిక ఒత్తిడికి కారణమవుతోందని స్థానిక నివాసితుల సంఘం పేర్కొంది.

**ముఖ్యమంత్రికి ఫిర్యాదు!**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మున్సిపల్ కమిషనర్‌కు స్థానికులు బహిరంగ లేఖ రాశారు. కేవలం వినోదం కోసం చేసే ఇటువంటి ప్రయోగాలు ప్రజల ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయని, డ్రైవర్ల దృష్టి మళ్లించి ప్రమాదాలకు కూడా దారి తీయవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ 'మ్యూజికల్' ప్రయోగాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ అందరివాడు

- ఆయన పోరాట స్ఫూర్తితోనే ముందుకు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ:** ఛత్రపతి శివాజీ మహారాజ్ అణిచివేతకు, నియంతృత్వానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం మరువలేనిదని, ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం వేములవాడ అర్బన్, రూరల్ మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆరపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు జయవరం, అయ్యోరుపల్లిలో జరిగిన శివాజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ ఏ ఒక్క వర్గానికో చెందిన వారు కాదని, ఆయన అందరివాడని కొనియాడారు. ధర్మ రక్షణ కోసం, ప్రజల స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాట చరిత్రను ప్రస్తుత తరం యువత తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరవేయాలని సూచించారు.

**ముంపు గ్రామాల సమస్యలపై వెనక్కి తగ్గేదే లేదు!**

నియోజకవర్గంలోని ముంపు గ్రామాల సమస్యలపై ఆది శ్రీనివాస్ గట్టిగా స్పందించారు. "సమస్యలను మసిపూసి మారేడు కాయ చేయడం నా నైజం కాదు. ముంపు గ్రామాల ప్రజల బాధలను నేను స్వయంగా అసెంబ్లీలో ప్రస్తావించాను. త్వరలోనే వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపిస్తాం" అని ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా సంకెపల్లిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గెజిట్ సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

**అభివృద్ధికి బాటలు.. నిధుల వరద!**

ఆరపల్లి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నియోజకవర్గంలోని మహిళా సంఘం భవనాల నిర్మాణానికి ఇప్పటికే రూ. 10 లక్షలు మంజూరు చేశామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గెలుపోటములు సహజం.. క్రీడాస్ఫూర్తే ముఖ్యం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ముగిసిన 8వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు**



**ప్రజానావ, వేములవాడ:** ఆటలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు జీవితంలోని ఆటుపోట్లను తట్టుకునే ధైర్యాన్ని ఇస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో గత నాలుగు రోజులుగా ఆది శ్రీనివాస్ సౌజన్యంతో, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించిన 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో బాలుర విభాగంలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, రంగారెడ్డి ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్ నగర్ జిల్లా మొదటి స్థానంలో నిలువగా, వరంగల్ ద్వితీయ, నల్లగొండ తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. విజేతలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'సీఎం కప్' పేరిట 45కు పైగా క్రీడలను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించడం ద్వారా సీఎంకు క్రీడల పట్ల ఉన్న మక్కువను చాటుకున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్న కోచ్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణను గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, యువత వ్యసనాల వైపు కాకుండా క్రీడల వైపు మళ్లాలని విప్ పిలుపునిచ్చారు. వేములవాడ ప్రాంత క్రీడాకారుల కోసం 5 ఎకరాల స్థలం కేటాయించామని, గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన స్టేడియం నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఏఎంసీ చైర్మన్ రోండి రాజు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జెల రమేష్ బాబు, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రేమ్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజానావ, ఖైరతాబాద్:** బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బస్తీలో సీసీ రోడ్డు పనులు గురువారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రేమ్ నగర్ సాయిబాబా మందిరం నుండి అంబేద్కర్ చౌరస్తా స్ట్రీట్ నెంబర్ 10 వరకు రూ. 26.25 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ 18 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ రావు మాట్లాడుతూ.. బస్తీలో గతంలో తాగునీరు కలుషితం కావడంతో ప్రజల ఆరోగ్య దృష్ట్యా కొత్త వాటర్ పైప్‌లైన్ మరియు సీవరేజ్ పైప్‌లైన్ పనులకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ భూగర్భ పనుల కారణంగానే సీసీ రోడ్డు పనుల ప్రారంభంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. రాబోయే 20 రోజుల్లో రోడ్డు పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన స్పష్టం చేశారు. బస్తీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కె. భగవాన్ దాస్ మాట్లాడుతూ.. పైప్‌లైన్ పనుల కోసం రోడ్లను తవ్వడంతో గత కొంతకాలంగా బస్తీ మొత్తం గుంతలమయంగా మారిందన్నారు. దీనివల్ల ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతతో కూడిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. బస్తీ అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిలకు ఈ సందర్భంగా బస్తీ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయ కమిటీ నాయకులు రవి చందర్, శాస్త్రి, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ దయానంద్ యాదవ్, అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు మున్నాభాయ్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బస్తీ నాయకులు రెహమాన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్ కుమార్, గంగ, రమేష్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.






# అలరించిన 'ద్రోణ' వార్షికోత్సవం

**చిన్నారుల నృత్యాలతో హోరెత్తిన సంబరాలు**



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలోని ద్రోణ పబ్లిక్ స్కూల్ తొలి వార్షికోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణం చిన్నారుల ఆటపాటలతో, రంగురంగుల వెలుగులతో పండగ వాతావరణాన్ని తలపించింది. అంబరాన్నంటిన ఈ సంబరాల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారులు తమ అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో వేదికపై సందడి చేశారు. వివిధ జానపద, సినీ గీతాలకు వారు వేసిన స్టెప్పులు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రతిభను చూసి ఆహుతులందరూ చప్పట్లతో వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా చదువులోనూ, ఇతర పోటీలలోనూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులను అందజేసింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సౌత్ జోనల్ మేనేజర్ సుధాకరన్, ఏరియా మేనేజర్లు సందీప్, ప్రశాంత్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడంలో ద్రోణ పబ్లిక్ స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉగిలే నాగరాజు, కరస్పాండెంట్ కవుడుక రమేష్, డైరెక్టర్లు డోకె నాగరాజు, బోనాల నాగరాజు, ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## శ్మశాన వాటికలో చెత్త తొలగింపు

**ప్రజానావ, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణ శివారులో గల హిందూ శ్మశానవాటిక పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా తయారైంది. మృతదేహాలను ఆ ప్రదేశానికి అంత్యక్రియలకు తీసుకు వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ ప్రాంగణంలో చెట్లు లేకపోవడంతో అంత్యక్రియల నిర్వహణకు వెళ్లినవారు నిలువ నీడ లేక ఎండ తీవ్రతతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సత్తుపల్లి లైన్స్ సత్తుపల్లి అధ్యక్షులు గోగడ రవికుమార్ ఈ ప్రాంగణ పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. ఈ విషయం వినతి పత్రం ద్వారా స్థానిక సింగరేణి జీఎం శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన జేసీబీని సమకూర్చారు. ఈ మిషన్ సహాయంతో గురువారం శ్మశానవాటికలోని చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. సుమారు 7 ఎకరాల స్థలంలో ఉన్న శ్మశానటికలో చెట్లు లేకపోవడంతో పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని లైన్స్ క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, గోగడ రవికుమార్, రావి నాగేశ్వరరావు తెలిపారు.

## పశువుల వాహనం పట్టివేత



**ప్రజానావ, జైనూర్:** జైనూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది జామ్‌గావ్ గ్రామ శివారులో చెక్‌పోస్ట్ వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో జైనూర్ వైపు నుంచి ఓ ఈచర్ వాహనం అతివేగంగా వస్తుండగా అనుమానం వచ్చి ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ వాహనంలో 23 పశువులు క్రూరంగా తాడులతో బిగించి, తగినంత స్థలం లేకుండా, గడ్డి, నీరు అందించకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను విచారించగా, వారు జైనూర్ పశువుల మార్కెట్ నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనంతో పాటు ఆ పశువులను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని జైనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పశువులను రవాణా చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రహదారి పనులు ప్రారంభం



**ప్రజానావ, హత్నూర:** మండలంలోని నవాబుపేట గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మత్తు పనులను స్థానిక సర్పంచ్ ఎరుకలి బుచ్చయ్య గురువారం గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. నవాబుపేట, హత్నూర గ్రామాల మధ్య ఉన్న చాక్ చెరువు కట్ట రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడడంతో మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎరుకలి బుచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్, నాయకులు రంగంపేట హరిబాబు, జక్కుల నారాయణ, రంగంపేట రాములు, కె ఎల్లయ్య, హాజీ పాషా, ఫహీం, మోహన్, అశోక్, ప్యారామియా, చిత్తరి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజానావ, మంచిర్యాల:** సమగ్ర భూ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య అన్నారు. గురువారం తాండూర్ మండలం రాంపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ సర్వేతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి సర్వే ప్రక్రియ పూర్తి స్థాయిలో చేపట్టేందుకు సహకరించాలని కోరారు. సర్వే పనులను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి, మండల తహశీల్దార్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షురాలిపై కుట్రలు మానుకోవాలి



**ప్రజానావ, జైనూర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్టుగా కాంగ్రెస్ పార్టీలో దొంగలు, ద్రోహులు ఉంటే వెంటనే పార్టీని విడిచి వెళ్లిపోవాలని జైనూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముఖీద్ ఘాటుగా హెచ్చరించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థిగా గెలిచిన కౌన్సిలర్ గుండ స్నేహ శ్యామ్ పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా బీఆర్ఎస్ కి మద్దతు తెలపడం అత్యంత నీచమైన చర్య అన్నారు. గురువారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న గుండ శ్యామ్, తిర్యాణి మండల నాయకుడు జువ్వాజీ అనిల్ గౌడ్ పార్టీకి నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ స్వయంగా అవకాశమిచ్చినా, ఆమె విశ్వాసాన్ని వమ్ము చేయడం క్షమించరాని నేరమని అన్నారు. చైర్మన్ ఎన్నికల పరిణామాలను వక్రీకరిస్తూ, కొంత మంది నాయకులు డీసీసీ అధ్యక్షురాలిపై అనవసర ఆరోపణలు చేయడం వెనుక అసలు కుట్రదారులు ఎవరో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పార్టీని బలహీనపర్చే వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని కోరారు. అనంతరం ఆదివాసి కాంగ్రెస్ నాయకుడు పెందురు ప్రకాష్ మాట్లాడుతూ ఆదివాసి మహిళ డీసీసీ అధ్యక్షురాలిగా ఎదగడాన్ని కొంత మంది జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. గతంలో పార్టీకి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పార్టీ మారినప్పుడు మౌనం వహించిన నాయకులు, ఇప్పుడు సుగుణ రాజీనామా కోరడం వెనుక దాగి ఉన్న శక్తులను అధిష్టానం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అజ్జు లాల, సూద్దాల శ్రీనివాస్, షాకీర్, దౌలత్, మజర్, ఇస్లాం, దండుగుల మహేష్, రియాజ్ ఖాన్, కుంర భుజంగ్ రావు, కన్ను పటేల్, మెస్రం గోవింద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**ప్రజానావ, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని యువత, శివాజీ సేన బాధ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ మహారాజ్ చిత్రాలతో, కాషాయ జెండాలతో అలంకరించిన వాహనాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. "ఛత్రపతి శివాజీ మహారాజ్ కి జై" నినాదాలతో సత్తుపల్లి పట్టణం మార్మోగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగి ర్యాలీ ప్రజల్లో దేశభక్తి, ధైర్యం, స్వాభిమానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం బోసు బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ చిత్రపటానికి శివాజీ సేన బాధ్యులు పాలాభిషేకం చేశారు. పుష్పాంజలి ఘటించి మహారాజ్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ

**ప్రజానావ, ఆదిలాబాద్:** తన మతాన్ని కాపాడుకుంటూ, పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన లౌకిక పాలకుడు, ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సుంకిడిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్ల నడుమ వైభవంగా విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సుపరిపాలనకు గొప్ప చిహ్నంగా శివాజీ మహారాజ్ నిలిచిపోయారని అన్నారు. శివాజీ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడని, స్వరాజ్య స్థాపనకు పునాది వేసిన గొప్ప యోధుడని కొనియాడారు. శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



# చావుతో చిన్నారి పోరాటం

**ఆదుకోండి ప్లీజ్!**

## బ్లడ్ క్యాన్సర్‌తో ఆలియా విలవిల

**రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం ● ఇప్పటికే రూ. 9 లక్షలు ఖర్చు చేసిన తండ్రి**

**దాతల చేయూత కోసం కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్న తల్లిదండ్రులు**



ఆడిపాడాల్సిన పదేళ్ల ప్రాయంలో ఆ చిన్నారిని మృత్యువు కబళించాలని చూస్తోంది. బ్లడ్ క్యాన్సర్ అనే మహమ్మారి సోకి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ చిన్నారికి ఇప్పుడు మనందరి సాయం కావాలి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాలిద్ కుమార్తె ఆలియా (10) ప్రాణాల కోసం చేస్తున్న పోరాటం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.

**- ప్రజానావ, గంభీరావుపేట**

### ఆస్పత్రి మంచానికే పరిమితమైన బాల్యం!

కొద్దిరోజుల క్రితం వరకు చలాకీగా ఉన్న ఆలియాకు జ్వరం, అలసట రావడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆ చిన్నారికి 'బ్లడ్ క్యాన్సర్' అని నిర్ధారించడంతో ఆ పేద కుటుంబం గుండె పగిలిపోయింది. ఏడాది కాలంగా హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇప్పటికే రూ. 9 లక్షల వరకు ఖర్చు చేశారు. రోజువారీ కూలీగా పనిచేసే తండ్రి ఖాలిద్ తనకున్నదంతా పోగుచేసి, అప్పులు తెచ్చి చికిత్స చేయిస్తున్నా, వ్యాధి తీవ్రత తగ్గడం లేదు.

### నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు

ప్రస్తుతం ఆలియాకు కీమోథెరపీతో పాటు ఖరీదైన స్టెమ్ సెల్ మార్పిడి వంటి చికిత్సలు అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. దీనికి ఇంకా లక్షలాది రూపాయలు అవసరం కానున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక, అప్పులు పుట్టక ఆ తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలో కన్నీరుమున్నీరవుతున్నారు. "మా బిడ్డను ఎలాగైనా కాపాడుకోండి" అంటూ దాతలను వేడుకుంటున్నారు.

### మనసున్న మా రాజులు ముందుకు రావాలి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు, దాతలు స్పందించి ఈ చిన్నారికి ప్రాణభిక్ష పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మన సమాజంలో మనసున్న వారు అందించే చిన్న సహాయం ఒక అమూల్యమైన ప్రాణాన్ని నిలబెడుతుంది. ఆపదలో ఉన్న ఆలియాను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూతనిచ్చి మానవత్వాన్ని చాటుకోవాలని గంభీరావుపేట వాసులు పిలుపునిస్తున్నారు.



